ఆస్ట్రేలియా X న్యూజిలాండ్
రా. 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో



# హోరాహోరీగా అథ్లెటిక్స్ పోటీలు

- లాంగ్‌జంప్‌లో అంజి, హైజంప్‌లో సిద్ధి వినయ్‌కి స్వర్ణం
- తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 7: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 10వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. పోటీల తొలి రోజు సోమవారం జరిగిన బాలుర, బాలికల అండర్-16, 18, 20 విభాగాల్లో అథ్లెట్లు డిస్కస్‌త్రో, హైజంప్, షాట్‌పుట్, లాంగ్‌జంప్, జావెలిన్‌త్రో, 800మీ, 1000మీ, 5000మీ, 10వేల మీ రేస్‌వాక్ పోటీల్లో అద్భుత ప్రదర్శన కనబరిచారు. బాలుర అండర్-18 డిస్కస్‌త్రోలో సునీత్ కుమార్, హైజంప్‌లో సిద్ధివినయ్, 5వేల మీ రేస్‌వాక్‌లో సాయిచరణ్‌రెడ్డి పసిడి పతకాలతో మెరిశారు. బాలికల అండర్-18 కేటగిరీ షాట్‌పుట్‌లో రాజరాజేశ్వరి, 1000మీ పరుగులో అఖిల స్వర్ణ పతకాలు సొంతం చేసుకున్నారు. మిగతా విభాగాల్లో ఈశ్వర్, సాయికిరణ్, విదిత్‌రెడ్డి, పవన్, విష్ణువర్ధన్, అంజి, శ్రీకాంత్, రాజేశ్, అఫ్రీన్, కల్యాణి, బుచ్చమ్మ, ప్రవళిక స్వర్ణాలు దక్కించుకున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచే ప్లేయర్లు ఈనెల 25 నుంచి 29 వరకు భువనేశ్వర్‌లో జరిగే జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ టోర్నీకి ఎంపిక చేస్తారు. రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు స్టాన్లీ జోన్స్, కార్యదర్శి సారంగపాణి, కోశాధికారి రాజేశ్ కుమార్, రాజేశ్వర్‌రావు, కుమార్‌యాదవ్, మురళీధర్, వెంకటేశ్వర్‌రెడ్డి..విజేతలకు పతకాలు ప్రదానం చేశారు.





## దంచికొట్టిన పాక్

### మసూద్, షఫీక్ శతకాలు

ముల్తాన్ : స్వదేశంలో ఇంగ్లండ్‌తో ముల్తాన్ వేదికగా సోమవారం ఆరంభమైన తొలి టెస్టులో మొదట బ్యాటింగ్ చేస్తున్న పాకిస్థాన్ దంచికొట్టింది. కెప్టెన్ షాన్ మసూద్ (151), ఓపెనర్ అబ్దుల్లా షఫీక్ (105) శతకాల మోత మోగించడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు 86 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 328 పరుగులు చేసింది. కొద్దిరోజుల క్రితమే బంగ్లాదేశ్‌తో సొంతగడ్డపై టెస్టు సిరీస్‌ను కోల్పోయి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న పాక్.. ఇంగ్లండ్‌తో తొలి రోజు సంపూర్ణ ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ఓపెనర్ సమీ అయూబ్ (4) వికెట్‌ను 4వ ఓవర్లోనే కోల్పోయినా అబ్దుల్లా, మసూద్ కలిసి భారీ ఇన్నింగ్స్ ఆడారు. బ్యాటింగ్‌కు స్వర్గధామమైన ముల్తాన్‌లో రెండో వికెట్‌కు ఈ ఇద్దరూ 253 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ముఖ్యంగా మసూద్.. వన్డే తరహా ఆట ఆడటంతో పాక్ భారీ స్కోరు సాధించింది.



*ఇరానీ కప్‌లో చారిత్రక విజయం సాధించిన ముంబై క్రికెట్ జట్టు సోమవారం సంబురాలు చేసుకుంది. జట్టుకు ఎంసీఏ కోటి రూపాయల నజరానా అందజేసింది*

# ఇంగ్లండ్ దూకుడు

**దక్షిణాఫ్రికాపై ఘన విజయం • సఫారీలను కట్టడి చేసిన ఇంగ్లీష్ స్పిన్నర్లు • రాణించిన వ్యాట్ హాడ్జ్, సీవర్**

షార్జా: ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ వరుసగా రెండో విజయాన్ని నమోదుచేసింది. గ్రూప్-బీలో షార్జా వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లిష్ జట్టు 7 వికెట్ల తేడాతో గెలిచి సెమీస్ అవకాశాలను మరింత పటిష్టం చేసుకుంది. సౌతాఫ్రికా అటు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ విఫలమై ఈ టోర్నీలో తొలి అపజయాన్ని మూటగట్టుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న సౌతాఫ్రికా.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 124 పరుగులు చేసింది. ఆ జట్టు సారథి లారా వోల్వార్డ్ట (39 బంతుల్లో 42, 3 ఫోర్లు) మరోసారి కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడగా ఆల్‌రౌండర్ మరిజన్నె కాప్ (26) ఆఖర్లో వేగంగా ఆడింది. స్వల్ప ఛేదనను ఇంగ్లండ్.. 19.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఆల్‌రౌండర్ సీవర్ బ్రంట్ (36 బంతుల్లో 48 నాటౌట్, 6 ఫోర్లు) రాణించగా గత మ్యాచ్‌లో మాదిరిగానే ఓపెనర్ వ్యాట్ హాడ్జ్ (43 బంతుల్లో 43, 4 ఫోర్లు) మరో కీలక ఇన్నింగ్స్ ఆడింది. రెండు వికెట్లు తీసిన సోఫీ ఎకిల్‌స్టోన్ (2/15)కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

### నత్తనడకన సఫారీ ఇన్నింగ్స్..

స్పిన్‌కు అనుకూలిస్తున్న షార్జాపై టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లారా వోల్వార్డ్ట ఎంత తప్పు చేసిందో అర్థం కావడానికి ఆ జట్టుకు పెద్దగా టైమ్ పట్టలేదు. సోఫీ ఎకిల్‌స్టోన్, చార్లీ డీన్, అలీస్ క్యాప్సీ వంటి నాణ్యమైన స్పిన్నర్లు కలిగిన ఇంగ్లండ్ ఆది నుంచే సఫారీలను కట్టడి చేశారు. బంతికో పరుగు చొప్పున ఆ జట్టు ఇన్నింగ్స్ సాగింది. ఓపెనర్ బ్రిట్స్ (13) డేనియల్ గిబ్సన్‌కు క్యాచ్ ఇచ్చింది. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో సౌతాఫ్రికాకు పరుగుల రాక కష్టమైంది. 7 నుంచి 12వ ఓవర్ మధ్య సౌతాఫ్రికా 5 ఓవర్లలో 23 రన్స్ మాత్రమే చేయగలిగింది. 15 ఓవర్లలో ఆ జట్టు స్కోరు 85/2గా ఉన్నప్పటికీ చివరి ఓవర్లలో కూడా పరుగుల రాక గగనమవడంతో సౌతాఫ్రికా తక్కువ స్కోరుకే పరిమితమైంది.

### ఇంగ్లండ్‌దీ అదే కథ..

స్వల్ప లక్ష్యమే అయినప్పటికీ ఛేదనలో ఇంగ్లండ్ సైతం తడబడింది. కాప్ వేసిన తొలి ఓవరే మెయిడిన్ అయింది. తనే వేసిన 5వ ఓవర్లో కాప్.. బౌచర్ (5)ను ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపింది. 5 ఓవర్లలో ఇంగ్లండ్ చేసిన స్కోరు 16 పరుగులే. కానీ అలీస్ క్యాప్సీ (19) మూడు ఫోర్లు కొట్టి ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చింది. కానీ క్యాప్సీ.. డి క్లర్క్ బౌలింగ్‌లో ఆమెకు రిటర్న్ క్యాచ్ ఇచ్చింది. వికెట్లు కోల్పోయినా.. సీవర్, వ్యాట్ హాడ్జ్ మూడో వికెట్‌కు 64 పరుగులు జోడించి ఇంగ్లండ్‌ను గెలుపు తీరాలకు చేర్చారు.



ఎకిల్‌స్టోన్ (2/15)

### సంక్షిప్త స్కోర్లు

**దక్షిణాఫ్రికా:** 20 ఓవర్లలో 124/6 (లారా 42, కాప్ 26, ఎకిల్‌స్టోన్ 2/15, సారా 1/18)
**ఇంగ్లండ్:** 19.2 ఓవర్లలో 125/3 (సీవర్ 48 నాటౌట్, వ్యాట్ హాడ్జ్ 43, కాప్ 1/17, లబ 1/22)

## నేటి నుంచే ఆర్కిటిక్ ఓపెన్

### సింధు, లక్ష్యసేన్ పునరాగమనం

ఫిన్‌లాండ్: పారిస్ ఒలింపిక్స్ తర్వాత కొద్దిరోజులు విరామం తీసుకున్న భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, లక్ష్య సేన్ తిరిగి బ్యాడ్మింటన్ కోర్టులో అడుగు పెట్టనున్నారు. మంగళవారం (అక్టోబర్ 8) నుంచి ఫిన్‌లాండ్‌లోని వాంటా వేదికగా జరిగే ఆర్కిటిక్ ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్‌లో ఈ ఇద్దరూ పునరాగమనం చేయనున్నారు. కొత్త కోచ్‌లు అనూప్ శ్రీధర్, కొరియా దిగ్గజం లి స్యూన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న సింధు.. తొలి రౌండ్‌లో కెనడా అమ్మాయి మిచెల్లె లి తో తలపడనుంది. మరోవైపు సేన్ గతేడాది ఇండియా ఓపెన్‌లో తనను ఓడించిన రస్మస్ జెమ్కె (డెన్మార్క్)ను ఢీకొననున్నాడు. ఈ ఇద్దరితో పాటు కిడాంబి శ్రీకాంత్, మాళవిక బన్సోద్, ఉన్నతి హుడా, ఆకర్షి కశ్యప్ వంటి స్టార్ షట్లర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

## లంక చీఫ్ కోచ్‌గా జయసూర్య

కొలంబో: శ్రీలంక దిగ్గజ ఆటగాడు సనత్ జయసూర్య ఆ జట్టుకు ఫుల్ టైమ్ హెడ్‌కోచ్‌గా నియమితుడయ్యాడు. గత జూలై నుంచి ఆ జట్టుకు తాత్కాలిక హెడ్‌కోచ్‌గా వ్యవహరిస్తున్న జయసూర్యకు రెండేండ్ల పాటు (2026 టీ20 వరల్డ్ కప్ దాకా) పూర్తిస్థాయి బాధ్యతలను అప్పగిస్తున్నట్టు శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) నిర్ణయం తీసుకుంది. జయసూర్య కోచింగ్‌లో లంక.. ఈ ఏడాది ఆగస్టులో భారత్‌ను వన్డేలలో ఓడించడమే గాక ఇటీవలే న్యూజిలాండ్‌తో ముగిసిన రెండు టెస్టుల సిరీస్‌నూ క్లీన్‌స్వీప్ చేసింది.

## తెలంగాణకు కాంస్యం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: సైఫాబాద్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ వేదికగా జరిగిన 34వ జాతీయ జూనియర్ త్రోబాల్ టోర్నీలో తెలంగాణకు రెండు కాంస్య పతకాలు దక్కాయి. సోమవారం జరిగిన బాలికల సెమీఫైనల్లో తెలంగాణ 13-15, 9-15తో ఢిల్లీ చేతిలో ఓడింది. మరోవైపు బాలుర సెమీస్‌లో తెలంగాణ 12-15, 13-15తో ఢిల్లీపై పరాజయం పాలైంది. ఢిల్లీ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది.

# దీపా కర్మాకర్ రిటైర్మెంట్



ఢిల్లీ: భారత స్టార్ జిమ్నాస్టిక్ క్రీడాకారిణి దీపా కర్మాకర్ సోమవారం ఈ ఆటకు రిటైర్మెంట్ ప్రకటించింది. ఈ క్రీడలో భారత్ తరపున ఒలింపిక్స్ (రియో, 2016)లో పాల్గొన్న తొలి జిమ్నాస్ట్‌గా గుర్తింపు దక్కించుకున్న 31 ఏండ్ల దీపా.. సోమవారం ఎక్స్ వేదికగా తన నిర్ణయాన్ని వెల్లడించింది. 'సుదీర్ఘ ఆలోచన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నా. ఇది తేలికైనది కాదని తెలుసు. కానీ సరైన సమయంలోనే రిటైర్మెంట్ తీసుకున్నానని భావిస్తున్నా. నా జీవితంలో జిమ్నాస్టిక్స్ ఓ భాగం. ఈ ఆటలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. కానీ ప్రతి క్షణానికి నేను ఎంతో కృతజ్ఞతతో ఉంటాను' అని పేర్కొంది. 2018లో జరిగిన ఎఫ్ఐజీ వరల్డ్ చాలెంజ్ కప్‌లో స్వర్ణం సాధించిన దీపా ఈ పతకం గెలిచిన తొలి భారత జిమ్నాస్ట్‌గా చరిత్ర సృష్టించింది. రియో ఒలింపిక్స్‌లో 0.15 పాయింట్ల తేడాతో త్రుటిలో కాంస్య పతకాన్ని కోల్పోయింది.

# భారత్‌కు అగ్రస్థానం

**ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్**

లిమా (పెరూ): ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో యువ షూటర్లు పతకాల పంట పండించడంతో పతకాల పట్టికలో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ టోర్నీ ఆఖరి రోజైన సోమవారం.. పురుషుల 50 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో దీపక్ దలాల్, కమల్‌జీత్, రాజ్ చంద్రతో కూడిన భారత త్రయం స్వర్ణ పతకం సాధించింది. ఫైనల్‌లో ఈ ముగ్గురూ 1,616 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచారు. మహిళల 50 మీటర్ల పిస్టల్ ఫైనల్‌లో పరిషా గుప్తా రజతం దక్కించుకోగా టీమ్ ఈవెంట్‌లో సెజల్ కాంబ్లీ, కేతన్, కనిష్క దాగర్ సైతం రజతం నెగ్గింది. మిక్స్‌డ్ టీమ్ ట్రాప్ కాంపిటీషన్‌లో శార్దూల్, సబీర కాంస్యం సాధించారు. ఈ టోర్నీలో భారత్ 13 స్వర్ణాలు, 3 రజతాలు, 8 కాంస్యాలతో మొత్తంగా 24 పతకాలు నెగ్గింది. ఇటలీ (13), నార్వే (10) తదుపరి స్థానాల్లో నిలిచాయి. ఆంధ్రా కుర్రాడు ముకేశ్ నెలవెల్లి పలు ఈవెంట్లలో పాల్గొని ఏకంగా 8 పతకాలు సాధించడం విశేషం.





# ప్రీతి జింటా జట్టు టైటిల్ గెలిచిందోచ్

గయానా: ఐపీఎల్ ప్రారంభ సీజన్ నుంచి ఆడుతున్నా ఇప్పటివరకూ ట్రోఫీ నెగ్గని జట్లలో పంజాబ్ కింగ్స్ ఒకటి. ఐపీఎల్‌తో పాటు కరేబియన్ ప్రీమియర్ లీగ్ (సీపీఎల్) లోనూ పంజాబ్‌కు ఫ్రాంచైజీ ఉన్నా ఈ రెండు లీగ్‌లలో ఇప్పటిదాకా ఆ జట్టు టైటిల్ నెగ్గలేదు. కానీ ఎట్టకేలకు ఆ ఫ్రాంచైజీ కోరిక నెరవేరింది. ఆదివారం ముగిసిన సీపీఎల్ ఫైనల్‌లో సెయింట్ లూసియా కింగ్స్.. 6 వికెట్ల తేడాతో గయానా అమెజాన్ వారియర్స్‌పై గెలిచి టైటిల్ కైవసం చేసుకుంది. సెయింట్ లూసియాకు బాలీవుడ్ సొట్టబుగ్గల సుందరి ప్రీతి జింటా సహ యజమానిగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన గయానా.. 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 138 పరుగులు చేసింది. ఫాఫ్ డుప్లెసిస్ సారథ్యంలోని సెయింట్ లూసియా.. 18.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని పూర్తిచేసింది. ఆరోన్ జోన్స్ (48 నాటౌట్), రోస్టన్ చేజ్ (39 నాటౌట్) రాణించారు. చేజ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, నూర్ అహ్మద్‌కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించాయి.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.